76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

రాజధాని వార్తలు దినపత్రికలో
పనిచేయుటకు నచ్ ఎడిటర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఎడ్వటైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, రిపోర్టర్‌లు కావలెను
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
76809 94755
rajadhanivartalu1@gmail.com

రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 4 సంచిక 18, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 21 - ఆదివారం 27 జనవరి, 2019

పేజీలు2లో... జన్మభూమిలో సాధించిందేమిటి ?



పేజీలు3లో... 17 ఏళ్లకే క్యాట్ ర్యాంకు సంహిత సొంతం

పేజీలు4లో... ప్రప్రథమ రిపబ్లిక్ వేడుకలు

పేజీలు4లో... పాదయాత్రలు -ప్రయోజనాలు

ఐక్యతా ర్యాలీకి భారీ స్పందన

మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్‌సిన్హా

వేదికపై సీఎం చంద్రబాబు పక్కన జాతీయ నాయకులు

మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కోల్‌కతా : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండగా, ప్రతిపక్షాల ఐక్యతను చాటిచెప్పేందుకు పశ్చిమ్‌బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధ్వర్యంలో భారీ ఐక్యతా ర్యాలీ జరిగింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానం వేదికగా జరిగే ఈ బహిరంగసభకు విపక్ష పార్టీలకు చెందిన పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు.

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్ణాటక సీఎం కుమారస్వామి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా తదితరులు బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకోరగా, వీరిని దీదీ సాదరంగా స్వాగతించారు. పాటిదార్ నేత హార్దిక్ పటేల్, జిగ్నేశ్ మేవాని, ఝార్ఖండ్ ముక్తి మోర్చా వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ సోరెన్ ప్రజలనుద్దేశించి

ప్రసంగించారు. తృణమూల్ కార్యకర్తలతో సభా ప్రాంగణం నిండిపోయింది.

భాజపా విభజించి పాలిస్తోంది: చంద్రబాబు

దేశాన్ని కాపాడుకోవాలనేదే మా అందరి లక్ష్యమని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భాజపా దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటే విపక్షాలుగా మేం ఏకం చేయాలనుకుంటున్నామని చెప్పారు. కోల్‌కతాలో నిర్వహించిన విపక్షాల ఐక్యతా ర్యాలీలో చంద్రబాబు ప్రసంగించారు. బెంగాలీలో ఆయన

హాజరైన జాతీయ నాయకులు

తన ప్రసంగాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్య సంగ్రామానికి పశ్చిమ్‌బంగ దశాదిశ చూపిందన్నారు. విపక్షాల ఐక్యతకు గొప్ప వేదికను ఏర్పాటు చేశారంటూ తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీని ప్రశంసించారు. విభజించు పాలించు అనే రీతిలో భాజపా దేశాన్ని పాలిస్తోందని చంద్రబాబు ఆరోపించారు. రైతుల కష్టాలు కేంద్రానికి పట్టడం లేదన్నారు. ఆర్థిక వ్యవస్థనూ కేంద్ర ప్రభుత్వం రాజకీయం చేసిందన్నారు. పెద్ద నోట్ల రద్దే అందుకు నిదర్శనమని చెప్పారు. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని చంద్రబాబు దుయ్యబట్టారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని..

- మిగతా 2 లో

ఎన్నికల కోసం

రూ.1లక్ష కోట్లు తాయిలాలు

వల విసిరిన బీజేపీ

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరుగుతుండటంతో, మోడీ ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు సాధారణ ప్రజలను ఆకర్షించడానికి రూ. 1 లక్ష కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది. వీటిలో రైతులకు సంబంధించిన వ్యవసాయ రుణ మాఫీలు, భారీ ర్యాలీలు, ఫ్లయింగ్ సముద్ర విమానాలు మొదలైనవి ఉన్నాయి. రాయిటర్స్ నివేదిక వెల్లడించిన దాని ప్రకారం ఎన్నికల కోసం ఈ భారీ ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని తెలిపింది. ఫిబ్రవరి 1 న తాత్కాలిక బడ్జెట్ సమర్పించనుంది. ఈ బడ్జెట్లో రైతులకు అనేక ఆకర్షణీయమైన కార్యక్రమాలు ప్రత్యేకంగా ప్రకటించనున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం అగ్రకులాలను ప్రోత్సహించడానికి విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు ప్రకటించింది. రైతుల బ్యాంకుల ఖాతాలకు డబ్బు నేరుగా ప్రత్యక్ష బదిలీ, వడ్డీ లేని రుణాలు అందించే మరో ప్రణాళిక సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ప్రకటన, కోడ్ అమలుకు ముందు వీటిని ప్రవేశపెట్టనుంది. బీజేపీ ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి గోపాల్ కృష్ణ అగర్వాల్ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఆర్థిక విధానాన్ని పార్టీ కోరిందన్నారు. స్టేట్ బ్యాంక్ గ్రూప్ , మరి కొన్ని ప్రభుత్వ వర్గాలు మాట్లాడుతూ రైతులకు వడ్డీ లేని రుణాల కోసం ఏడాదికి 12,000 కోట్ల వ్యయం అవుతుందని, వీటిని స్టేట్ బ్యాంక్ గ్రూప్ ద్వారా ఇస్తామన్నారు. వివిధ పథకాల కోసం ప్రభుత్వానికి మరో 40,000 కోట్ల రూపాయలు అవసరమవుతుంది. జీఎస్టీ రేటు తగ్గింపు వ్యక్తిగత,వాణిజ్య పన్ను రాయితీలు కారణంగా ప్రభుత్వం 25,000 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతుంది. జీఎస్టీ రేటు తగ్గింపు ఏడాదికి రూ. 13,000 కోట్ల రాబడి నష్టానికి దారి తీస్తుంది. సొంత భూమి ఉన్న రైతులకు హెక్టారుకు రూ. 2,000 రూ. 4,000 పంట సహాయం ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. ఇవి ప్రభుత్వ అధికారులచే ఇంకా అధికారికంగా నిర్ధారించబడలేదు.

సదరన్ గ్రాండ్ హోటల్ జనరల్ మేనేజర్ డాక్టర్ రాజేష్‌కు రాజధాని అమరావతిలో హోటల్ నిర్మాణానికి స్థలం మంజూరు పత్రాన్ని ఇస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

మార్చిలో ఎన్నికల నగారా

లోక్‌సభ, ఏపీ సహా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు

న్యూఢిల్లీ / అమరావతి : సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం అందుకు అవసరమైన కసరత్తు చేపట్టింది. మార్చి మొదటి వారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగే అవకాశం ఉంది. 6 లేదా 7 దశల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఈసీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. జమ్మూకాశ్మీరుకు కూడా లోక్‌సభతో పాటు ఎన్నికలు నిర్వహించే అంశంపై కసరత్తు చేస్తోంది. జమ్మూకాశ్మీరు అసెంబ్లీ పదవీకాలం 2021 మార్చి 16 దాకా ఉంది. అయితే, గతేడాది నవంబరులో ఆ అసెంబ్లీని రద్దు చేశారు. దీంతో తాజాగా ఎన్నికలు నిర్వహించాల్సి వస్తోంది. 16వ లోక్‌సభ పదవీకాలం జూన్ 3తో ముగియనుంది. ఈ లోపే ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి కావాల్సి ఉంది. దీంతో వేగం పెంచిన ఎన్నికల కమిషన్ మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమయం జూన్ 18న, ఒడిశా అసెంబ్లీ కాలం జూన్ 11, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ

కాలం జూన్ 1, సిక్కిం అసెంబ్లీ కాలం మే 27తో ముగియనుంది. ఏపీ విషయానికొస్తే..2019లోకి అడుగుపెట్టడంతో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేడి మరింత రాజుకుంది. ఏపీలోని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. 2014లో ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 5న ప్రకటించారు. ఏప్రిల్, మే నెలల్లో 9 దశల్లో ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఓట్ల నమోదు, తొలగింపు : ద్వివేది

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసే వరకూ కొత్త ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు.

డబ్బే ప్రధానం

రాజధాని వార్తలు డెస్క్ విజయవాడ : ఇటీవల విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ముస్లింల సాధికారిత సదస్సు జరిగింది. రాజకీయ సాధికారిత దిశగా ముస్లింలను ఏకం చేయాలని మాజీ ఎం.పి జి. నిజాముద్దీన్ ఐ.ఎఫ్.యం.ఆర్ ద్వారా రాష్ట్రంలో పలుకీలక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడలో జనవరి 12న ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్రంలోని అనేక మంది రాజకీయ నాయకులు, విద్యావంతులు స్థానిక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలుగా చెప్పున్న ముస్లింలకు రాజకీయ సాధికారిత దిశగా అనేక మంది ప్రసంగించారు.దీంతో పాటు జస్టిస్ రంగనాథ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. ముస్లిం సాధికారతగా ముస్లిం జనాభా దామాషా ప్రకారం ముస్లింలకు చట్ట సభలో భాగస్వామ్యం కల్పించమని ఐ.ఎఫ్. యం.ఆర్ ఛైర్మన్ జి.నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. అయితే రాజకీయాలకు సంబంధం లేకుండా సభ జరుగుతుందని నిర్వాహకులు చెప్తున్నప్పటికీ సభకు ఆహ్వానితులు నూటికి 85శాతం రాజకీయ నాయకులే స్టేజీ మీద ఉండటం చూపరులకు ఆశ్చర్యం కల్గించింది. ముఖ్యంగా టి.డి.పి నాయకులే అత్యధికంగా తరలివచ్చినట్టు కన్పిస్తుంది. ఈ నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా సభ్యులు ప్రసంగించారనేది హాస్యాస్పదమే. మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫారూక్ ప్రసగింస్తూ దామాషా ప్రకారం ముస్లింలకు సీట్లు ఇచ్చినా గెలవగలరా , గెలిపించుకునే నాయకులెవరు అని ప్రశ్నించారు. డబ్బే ప్రధాన ఆయుధంగా ఎన్నికల అభ్యర్థులు బరిలోకి దిగుతుంటే పేద ముస్లిం నాయకులు ఎలా గెలవగలరు. ఈ నేపథ్య ంలో వివిధ సంఘాల ఎన్.జి.ఓలతో చర్చించుకుని తమ అభ్యర్థులను తయారు చేసుకుని ముందుకొస్తే టి.డి.పి అధిష్టానంతో మాట్లాడతానని మైనార్టీ మంత్రి ఫారూక్ తెలిపారు. ఏదిఏమైనప్పటికీ ముస్లింలు రాజకీయంగా ఏకతాటిపైకి వస్తేనే తమ సమస్యలు పరిష్కారమ వుతాయాని పలువురు విశ్లేషకులు తెలుపుతున్నారు.

ప్రమాణస్వీకారం చేసిన రాజాసింగ్

హైదరాబాద్ : గోషామహల్ ఎమ్మెల్యేగా రాజాసింగ్ ప్రమాణస్వీకారం చేశారు. శాసనసభలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తన ఛాంబర్‌లో ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. హిందీలో దైవసాక్షిగా ఆయన ప్రమాణం చేశారు. ఇటీవల అసెంబ్లీలోని కొత్త ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంఐఎంకు చెందిన అహ్మద్ ఖాన్ ముందు ప్రమాణస్వీకారం చేసేందుకు రాజాసింగ్ నిరాకరించారు. ఈ సందర్భంగా ఆయన సీఎంపై కూడా విమర్శలు చేశారు. తాజాగా పోచారం శ్రీనివాసరెడ్డి స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టడంతో శనివారం ప్రమాణ స్వీకారం చేసేందుకు రాజాసింగ్ అంగీకరించారు.

ఈవారం రాజధాని

- అమరావతికి రానున్న ఏడు 5 స్టార్ హోటళ్లు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- వెంకటపాలెంలో రూ.448 కోట్లతో ఐటీ పార్కు
- అమరావతిలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి 31న భూమి పూజ: టీటీడి ఛైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

మాజీ పార్లమెంట్ సభ్యుడు నిజాముద్దీన్

రాజధాని వార్తలు, విజయవాడ : ముస్లింలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సీట్లు కేటాయించాలని, అలా పట్టించుకునే పార్టీలకే తమ అండదండలు ఉంటాయని మాజీ ఆర్‌టీఐ కమిషనర్. ఇంటిగ్రేటెడ్ ఫోరం ఫర్ ముస్లిం రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు

- మిగతా 2 లో

ఎక్కడవేసిన గొంగళి అక్కడే

- పోషకాహారంలో రెండేళ్లుగా మారని గణాంకాలు
- వేధిస్తున్న ఎదుగుదల, బరువు లోపాలు
- నీతిఆయోగ్ గణాంకాలు

రాజధాని వార్తలు, అమరావతి : ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు చిన్నారుల్లో పోషకాహార లోపం వెక్కిరిస్తోంది. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న పూర్తిస్థాయిలో నియంత్రించలేక పోతుంది. ఐసీడీఎస్ వంటి పలు కార్యక్రమాలు నిర్వహణలో ఉన్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రావటం లేదు. 2018 - 2019 బడ్జెట్ లో ప్రత్యేక పోషకాహార కార్యక్రమాన్ని ప్రారంభించినా నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోలేకపోతుంది. పోషకాహార లోపంతో చిన్నారులు మృత్యువాత పడుతున్నా సర్కార్ పటిష్ట ప్రణాళికలు అమలు చేయడంలో విఫలమవుతుందనే విమర్శలున్నాయి. ప్రతి ఏడాది గణాంకాలు నమోదు చేస్తున్నారే తప్ప పరిష్కార మార్గాలు అమలు చేయడంలో అంతటి శ్రద్ధ కనబరుస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. పోషకాహార లోపంతో పిల్లల్లో ఎదుగుదల లోపించటమే కాక



తక్కువ బరువు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సమస్యల్లో ఏపీ రెండవ స్థానంలో ఉన్నట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి.

మార్పు లేని పరిస్థితులు..

పోషకాహార లోపం అధిగమించటంలో

- మిగతా 2 లో

21 నుండి త్యాగరాజు ఆరాధన ఉత్సవాలు

రాజధాని వార్తలు,అమరావతి కర్ణాటక సంగీత సృష్టికర్తల్లో ప్రముఖుడైన తెలుగు నాటదక్కని ప్రభుత్వ గుర్తింపు దక్షిణ భారత శాస్త్రీయ సంగీతంగా ప్రపంచ ఖ్యాతి పొందిన కర్నాటక సంగీత సృష్టి కర్తలలో ప్రముఖుడైన త్యాగరాజు స్వామి వర్ధింతి సందర్భంగా తమిళనాడులోను ప్రపంచంలో 10,12 దేశాలలోనూ ఏటా జరిగే త్యాగరాజు ఆరాధనోత్సవాలు ఈ ఏడాది పంచాగం ప్రకారం జనవరి 21 నుండి ప్రారంభమవుతుంది. ఆంగ్ల కేలండర్ ప్రకారం 1847 జనవరి 6న శ్రీ త్యాగరాజు నిర్వాయణం జరగగా కొన్ని దశాబ్దాలుగా తమిళనాడులో ఆయన జన్మస్థలం తిరువాయూరులో జనవరి 6 నుంచి ఘనంగా త్యాగరాజు ఆరాధనా ఉత్సవాలు జరుగుతున్నాయి. తమిళనాడులో జన్మించిన త్యాగరాజు తెలుగువాడు ఆయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కాకర్లలో ఉండేవారు. త్యాగరాజు తల్లిదండ్రులు తమిళనాడుకు వలసపోగా 1767 మే 4న



త్యాగరాజు తమిళనాడులో జన్మించాడు. చిన్న తనంలోనే సంగీతంలో ప్రతిభ కనపర్చిన

- మిగతా 3 లో

రాజధాని వార్తలు కలం

రాజాసింగ్ కండకావరం

మూర్ఖత్వం, అజ్ఞానం, అహంకారం మూర్తీభవించిన వ్యక్తి బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్.. నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో పేరుగాంచాడు. బీసీ కులానికి చెందిన ఆయనను ఉన్నత హిందూ కులాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే విధంగా వాడుకుంటున్నాయి. గుడుంబా కాసి వీధుల్లో అమ్మడం, పశువులను దొంగిలించడమే కాకుండా పేద వీధి వర్తకుల నుంచి మమూళ్లు వసూళ్లు చేసేవాడని స్థానికులు చెబుతుంటారు. భారతీయ చట్టాలు,రాజ్యాంగంపై గౌరవాభిమానాలు లేని ఆయన **ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను ఎంపిక చేయడం సరైంది కాదని, ఆయన ముందు తాను ప్రమాణం చేయనని రాజాసింగ్ ప్రకటించారు. ఈ మేరకు రాజాసింగ్ వాట్సాప్‌లో ఓ వీడియోను విడుదల చేశారు. సాధారణంగా సీనియర్ ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం ఆనవాయితీ. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ ఆ సంప్రదాయాన్ని పాటిస్తూ.. చార్మినార్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యే అయిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను సీఎం కేసీఆర్ ప్రొటెం స్పీకర్‌గా ప్రతిపాదించగా, దీనిని రాజాసింగ్ వ్యతిరేకించాడు. ముస్లింలంటే మండిపడే ఆయన ఏఐఎంఐఏ అధినేత అసదుద్దీన్ తల నరికినప్పుడే తన ఆత్మ సంతృప్తి కలుగుతుందని విద్వేష విషం చిమ్మాడు.**

సనాతన సంప్రదాయ పేరుతో ఆయన చేసే వ్యాఖ్యలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తాయి. హైదరాబాద్‌లో పద్మావతి సినిమా ప్రదర్శిస్తే కచ్చితంగా సినిమాహాలను దహనం చేస్తామని టీవీ9లో తెలిపారు. ఇలాంటి వారికి మాధ్యమాలు ఏమాత్రం అవకాశం కల్పించినా ఇలాగే రెచ్చిపోతారని ఈ ఘటనతో ప్రజలకు తెలిసింది. ప్రతి భారతీయుడు, రాజపుత్రులు, హిందువులు ఈ సినిమాను బాయ్‌కాట్ చేయాలని కూడా ఆయన పిలుపునిస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌కు సినిమాను నిషేధించాలని లేఖ కూడా రాశారు. సినిమా మహిళలు ప్రతి రోజు భర్తలను మారుస్తారని కూడా వ్యాఖ్యానించాడు.ఆయా సంఘాల నుంచి వచ్చిన విమర్శలకు ఆయన క్షమాపణ తెలిపారు. అంతేకాదు.. పశ్చిమ బెంగాల్‌లోని బదురియా, బసిర్హత్‌లో జరిగిన మతవిద్వేషాలపై స్పందించిన రాజా సింగ్ 2002లో గుజరాత్ హిందువుల్లా ప్రతిస్పందించాలని, బెంగాల్ హిందువుల బంగ్లాదేశ్ వెళ్లి దాన్ని హిందూరాజ్యంగా మార్చాలని పిలుపు నిచ్చాడు. కాశ్మీర్ పండిట్లలా హిందువులు వలస వెళ్లాలని కూడా వీడియో సందేశంలో సూచించాడు. పాత బస్తీని మినీ పాకిస్థాన్‌తో పోలిస్తూ అనేక మార్లు కామెంట్లు చేయడంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. మరొక వీడియోలో కాశ్మీర్ ముస్లింలను దేశద్రోహులుగా వ్యాఖ్యానించడమే కాకుండా అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే వారు ముస్లిం వద్ద నుంచి ఏమీ కొనవద్దని కోరాడు. ఇలా చేస్తే వారంతా బానిసల్లా మోకాళ్లపై నిలబడి హిందువులను యాచిస్తారన్నాడు. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ప్రాణాలు తీయడానికైనా, ఇవ్వడానికైనా సిద్ధంగా ఉన్నానన్న ఆయన, సెక్యూరిటీ వదిలిరా.. బలాబలాలు చూసుకుందాం అంటూ అక్బరుద్దీన్‌కు విసిరిన సవాలుపై ఎంఐఎం నాయకులు కేసు నమోదు చేశారు. వందేమాతరం పాడకపోతే, భారత్‌మాతాకి జై అనకపోతే దేశం విడిచి వెళ్లాలని గదమాయించాడు. కేరళలోని వామపక్ష నేత, ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌ను హిందువుల హంతకుడిగా పేర్కొంటూ కేరళలో హిందువులు సురక్షితంగా లేరని వారిలో అభద్రతను పెంచే వ్యాఖ్యలు చేశాడు. సమాజాన్ని కులపరంగా విభజించడమే కాకుండా విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడిచేసిన కేసులో ఆయనపై కేసు నమోదు అయ్యింది. అసోంలో అక్రమంగా నివశిస్తున్న బంగ్లాదేశీయులను కాల్చిచంపుతాననడం కండకావరానికి గుర్తు. ఇతనిపై ఎన్నికల కమిషన్ 43 కేసులు నమోదు చేసింది. రాజాసింగ్ వ్యాఖ్యలతో విసుగెత్తిన అక్బరుద్దీన్ బీజేపీ భావజాలం గంగ కంటే మురిగ్గా ఉన్నాయని ఇప్పటివరకు రూ. 7 వేల కోట్లు ఖర్చుపెట్టినా గంగను శుద్ధిచేయలేకపోయారని విమర్శించారు. చిన్న చిన్న విషయాలకే దేశద్రోహం కేసు నమోదు చేసే బీజేపీ ప్రభుత్వం మతసామరస్యాన్ని తుంగలో తొక్కే ఇలాంటి నాయకులను పెంచి పోషిస్తూ, దేశ భద్రతకు, శాంతిసామరస్యాలకు సవాలు విసురుతోంది.

మైనార్టీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

రాజధాని వార్తలు, అమరావతి: మైనార్టీ సంక్షేమంపై తెలుగుదేశం పార్టీకి చిత్తశుద్ధి లేదని బడ్జెట్లో వెయ్యి కోట్లకు పైగా కేటాయించామని చెబుతున్న టీడీపీ ప్రభుత్వం ఎన్ని నిధులు విడుదల చేసి మైనార్టీలకు ఖర్చు చేశారో వెల్లడించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి డిమాండ్ చేశారు. మంగళగిరి రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమం గురించి తెలుగుదేశం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదని ఆయన అన్నారు. మైనార్టీలకు 6నెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకేజ్ రుణాల మంజూరు కోసం లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు నేటివరకు సబ్సిడీ వారి ఖాతాలలో జమ చేయకపోవడం వలన మైనార్టీలు రుణాలు పొందలేకపోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. నిధులు లేవని అధికారులు ఒక వంక చెబుతుంటే టీడీపీ నాయకులు మాత్రం వేలాది కోట్ల రూపాయలతో మైనార్టీ సంక్షేమం చేస్తున్నామని గొప్పలు చెప్పడం విచారకరమని ఆయన అన్నారు. ఇంకో నెల రోజులలో ఎన్నికల కోడ్ రానున్నందున సబ్సిడీ విడుదల చేయకపోతే వేలాది మంది లబ్ధిదారుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. వెంటనే మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫారూఖ్ అధికారులతో సమీక్ష నిర్వహించి ఏ జిల్లాకు ఎన్ని నిధులు కావాలో ఎన్ని నిధులు అవసరం అవుతాయో ఆ మేరకు నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ రబ్బాని, జిల్లా అధ్యక్షులు షేక్ ఫిరోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ అమీరుల్లా ,నగర అధ్యక్షులు షేక్ ఇలియాజ్, దరీయా, బాబావలి లు పాల్గొన్నారు.

జన్మభూమిలో సాధించిందేమిటి ?

మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. కానీ ఆచరణలో మాత్రం అదికనిపించడం లేదు. ఇందుకు ఇటీవల ముగిసిన జన్మభూమి మా ఊరు ప్రత్యక్ష తార్కాణం. జన్మభూమి మా ఊరు గ్రామ సభల్లో అర్జీల పరిష్కారం పది శాతంలోపుగానే ఉంది. మొత్తం 7.12 లక్షల అర్జీలు రాగా, గ్రేడింగ్‌తో వాటిని 5.87 లక్షలకు కుదించారు. అందులోనూ ఇప్పటి వరకు 36,082 (6శాతం) దరఖాస్తులనే ప్రభుత్వం పరిష్కరించింది. మొత్తం దరఖాస్తులలో ఇళ్లు, స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులదే అగ్రస్థానం. ఈ నాలుగు సమస్యలపైనే అక్షరాల 4.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం ఆరుసార్లు జన్మభూమి గ్రామసభలు నిర్వహించగా, ఇళ్లు, స్థలాల కోసం పది లక్షలకుపైగానే అర్జీలు వచ్చినా పరిష్కారానికి నోచుకోవటం లేదు.

- అర్జీల పరిష్కారం10 శాతంలోపే
- మొత్తం దరఖాస్తులు 5.87 లక్షలు
- ఇళ్లు, స్థలాలు, పింఛన్లకే 3 లక్షలు
- రేషన్ కార్డు అర్జీలు 1.42 లక్షలు

రాజధాని వార్తలు డెస్క్ – అమరావతి : ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న ఐదేళ్లలో అభివృద్ధి పనుల ప్రణాళికల రూపకల్పన కోసమే జన్మభూమి –మా ఊరు గ్రామ సభలు నిర్వహించామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా..సభల్లో సమస్యల పరిష్కారం అంతంత మాత్రంగానే ఉందన్న విషయం అధికారిక గణాంకాలతోనే తేటతెల్లమైంది. ఈ నెల 2 నుంచి 11 వరకు జన్మభూమి గ్రామసభల నిర్వహణకు ప్రభుత్వం అక్షరాల రూ.13 కోట్లు విడుదల చేసింది. వాస్తవానికి ఖర్చు మాత్రం రూ.50 కోట్లపైనే జరిగినట్లు అంచనా. జన్మభూమి మా ఊరు గ్రామసభలలో మరోసారి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లకే అత్యధికంగా అర్జీలు వచ్చాయి. పుష్కరకాలంగా ఇళ్ల స్థలాల సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదు. రాష్ట్రంలో సుమారు లక్షన్నరకుపైగానే ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. వాస్తవానికి ఈ సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ గణాంకాలలో తక్కువగా చూపించటం గమనార్హం. ఇళ్లు కావాలని మరో లక్షమంది దరఖాస్తు చేసుకున్నారు. పేదరిక నిర్మూలన, సామాజిక పింఛన్లకు 1.70 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో 3,606 మాత్రమే పరిష్కారమయ్యాయి. రేషన్ కార్డుల కోసం 1.42 లక్షలకుగాను 15,109 అర్జీలు పరిష్కరించారు. పక్కా ఇళ్ల కోసం 90 వేల అర్జీలు రాగా, కేవలం 3,321 ఇళ్లనే ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 5.87 లక్షల అర్జీలలో పలు శాఖల అధికారులు 3.98 లక్షల దరఖాస్తులను పరిశీలించినా, ఒక్క మంజూరు లేదు. మరో లక్షకుపైగా అర్జీలను పరిశీలించాల్సి ఉంది. రాష్ట్రంలో ఎన్‌టీఆర్ గృహనిర్మాణ పథకం కింద పక్కా గృహాల కోసం లక్షలాది మంది పేదలు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది పేదలు ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నట్లు గతేడాది గృహనిర్మాణశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు ప్రకటించారు. తాజాగా సభలతో ఆ సంఖ్య మరింత పెరిగినట్లు సమాచారం. ఇక ఇళ్ల స్థలాల సమస్య నేటికీ పరిష్కారం కావటం లేదు. ఒకటీ, రెండు జిల్లాల్లోని మంత్రుల అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే నివేశన స్థలాల పంపణీ జరగ్గా, మెజార్టీ నియోజకవర్గాల ప్రజలు అందుకు నోచుకోలేదు. ఆరో విడత జన్మభూమిలోనే 1.20 లక్షల మంది స్థలాలు కావాలని అర్జీ చేసుకున్నారు. గతంలోనూ పది లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పశ్చిమ గోదావరిలో అత్యధికం

జన్మభూమి మా ఊరు గ్రామసభల్లో పశ్చిమ గోదావరి జిల్లాలోనే అత్యధికంగా ప్రజల నుంచి అర్జీలు వచ్చాయి. పశ్చిమంలో మొత్తం 78,796 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 5,390 పరిష్కారమయ్యాయి. ఈ జిల్లాలోని పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా ప్రజల నుంచి 7,519 దరఖాస్తులు రాగా, 884 పరిష్కారమయ్యాయి. అత్యల్పంగా కడప జిల్లాలో 21,496 దరఖాస్తులకుగానూ 1,468ని అధికారులు పరిష్కరించారు. ఇక గుంటూరులో 71,824, చిత్తూరులో 63,155 , తూర్పు గోదావరిలో 58,724, కర్నూలులో 57,551, విశాఖలో 43,507 జన్మభూమి అర్జీలు వచ్చాయి. అసెంబ్లీ నియోజకవర్గాలలో తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు నుంచి అత్యధికంగా 11,200 దరఖాస్తులకు 608 పరిష్కారమయ్యాయి. విశాఖ తూర్పు నియోజకవర్గంలో 8,631కి 944, గోపాలపురంలో 8,365కి 313, గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో 7,648 అర్జీలకు కేవలం 383 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి.

జన్మభూమి మా ఊరు గ్రామ సభల్లో జిల్లాల వారీగా దరఖాస్తులు

జిల్లా పేరు	వచ్చిన అర్జీలు	పరిష్కారం
పశ్చిమ గోదావరి	78,796	5,390
గుంటూరు	71,824	3,231
చిత్తూరు	63,155	4,071
తూర్పు గోదావరి	58,724	3,740
కర్నూలు	57,551	2,489
విశాఖపట్నం	43,507	3,534
ప్రకాశం	39,538	2,472
విజయనగరం	35,787	1,707
కృష్ణా	32,783	1,573
అనంతపురం	32,269	1,597
నెల్లూరు	26,465	3,495
శ్రీకాకుళం	25,682	1,313
కడప	21,496	1,468
మొత్తం	5,86,982	36,082

రాష్ట్రానికి 1.28లక్షల ఇళ్లు మంజూరు

- రూ.3,205కోట్లు కేటాయింపు
- శంకుస్థాపనలు చేయనున్న అధికారపార్టీ ఎమ్మెల్యేలు

రాజధాని వార్తలు, అమరావతి : రాష్ట్రంలో అర్బన్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో నూతన గృహాలు నిర్మించుకోవడానికి వీలుగా ప్రభుత్వం 1.28లక్షల గృహాలను నూతనంగా మంజూరు చేసింది. నిర్మాణాల నిమిత్తం రూ.3,205కోట్లు నిధులు కేటాయించింది. సంక్రాంతి పండుగ తర్వాత వీటి నిర్మాణాలు ఆరంభం కానున్నాయి. నిర్మాణాలు ఆరంభం కానున్నాయి. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు నూరుశాతం గృహాలు కలిగి ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం కేటాయింపులు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణాలలో నూతన ఒరవడి సంతరించుకుంది.గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దఎత్తున గృహాలు మంజూరు అవుతున్నాయి. తాజాగా 1.28లక్షల గృహాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం కింద వీటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కొక్క గృహానికి కేంద్రప్రభుత్వం రూ.1.50లక్షలు ఇస్తుండగా, రాష్ట్రప్రభుత్వం రూ.50వేలు ఇస్తుంది. మరో రూ.50వేలు లబ్ధిదారులు తమ వాటా కింద వేయాల్సి ఉంది. సొంతంగా స్థలం కలిగిన లబ్ధిదారులు దీనికి అర్హులై ఉన్నారు. ఇప్పటికే అబ్ధిదారుల ఎంపిక జరిగిపోవడంతో సంక్రాంతి పండుగ తర్వాత నుంచి స్థానిక ప్రజాప్రతిరిధులు వీటి శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు తుర్పుగోదావరిజిల్లాకు 2,311 ఇళ్లుచేశారు. వీటిని కడియం, రాజమండ్రి రూరల్, కోరుకొండ, రాజానగరం, సీతానగరం, మండ పేటరూరల్, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, తాళ్లరేవు, ఆత్రేయపురం, తొండంగి ప్రాంతాలకు కేటాయించారు. అలాగే నెల్లూరు జిల్లాకి 18వేలు ఇళ్లు కేటాయించారు. వీటిని .ఇల్లాలో సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కావలి, సుళ్లూరుపేట, జమ్ములపాలెం, గూడూరు ప్రాంలాలలో నిర్మించనున్నారు. కర్నూలు జిల్లాకు 15,680 ఇళ్లును కేటాయించారు. వీటిని నంద్యాల, పత్తికొండ, దోనే, కొండమూరు, పన్యంలకు కేటాయించారు. అనంతపురం జిల్లాకు 6,677 ఇళ్లును కేటాయింటారు. వీటిని జిల్లాలో ధర్మపురం, హందూపురం, రాప్తాడు ప్రాంతాలలో నిర్మించనున్నారు. శ్రీకాకుళం జిల్లాకి 22,828 ఇళు కేటాయించారు. వీటిని ఆముదాలవలస, నరసన్నపేటలకు కేటాయించారు. విశాఖపట్నం జిల్లాకి 30.821 ఇళ్లును మంజూరు చేశారు. వీటిని అనకాపల్లి, పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తిలకు ఇచ్చారు. చిత్తూరు జిల్లాకి 3,300 ఇళ్లు కేటాయించారు. వీటిని తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరిలలో నిర్మించనున్నారు. గుంటూరు జిల్లాకి 6,458 ఇళ్లును మంజూరు చేశారు. వీటిని మంగళగిరి, పెదకూరపాడు, ప్రత్తిపాడు, సత్తెనపల్లి, తాడికొండ, చిలకలూరిపేట, పొన్నూరు, తెనాలి, వేమూరు ప్రాంతాలలో నిర్మించనున్నారు. కృష్ణాజిల్లాకి 4,223 గృహాలను కేటాయించారు. వీటిని గుడివాడ, అవనిగడ్డ, పామర్రు, మచిలీపట్నం, పెడన ప్రంతాలలో నిర్మించనున్నారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో

వచ్చే ఫిబ్రవరినెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున వీటి నిర్మాణాలకు సంబంధించిన శంకుస్థాపనలు ఆయా నియోజకవర్గ అధికారపార్టీ ఎమ్మెల్యేలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు అంతర్గతంగా ఆదేశాలిచ్చినట్లు సమాచారం. శంకుస్థాపనలు పూర్తి చేసి పునాది నిర్మాణాలు ఆరంభిస్తే తొలిబిల్లు క్లియర్ చేసి ఓటు బ్యాంకుగా చేసుకోవాలని అధికార పార్టీ తహతహలాడుతుంది. ఈనేపథ్యంలో వీటి శంకుస్థాపనలపై అధికారులపై తీవ్ర ఒత్తిడి వస్తున్నట్లు చెబుతున్నారు.

దరఖాస్తు దారులంతా 'హజ్‌యాత్ర'కు అర్హులే

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ ఆలీ

రాజధాని వార్తలు –అమరావతి: హజ్‌యాత్ర –2019కు దరఖాస్తు చేసిన వారందర్నీ ఎంపిక చేసినట్లు కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ ఆలీ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది ఏపీ నుంచి మొత్తంగా 2,138మంది హజ్‌యాత్రకు దరఖాస్తు చేశారని, వారిలో 2,135 మంది పెద్దలు, రెండేళ్లలోపు ముగ్గురు చిన్నారులన్నారని తెలిపారు.ఇందులో 40మంది 70 ఏళ్లపైబడిన వారున్నారని వివరించారు. అనంతపురంజిల్లా నుంచి 298, చిత్తూరు–206, ఈస్ట్‌గోదావరి–39, గుంటూ రు–326, కడప–241, కృష్ణా–230, కర్నూలు–473, నెల్లూరు–121, ప్రకాశం –43, శ్రీకాకుళం–7, విశాఖపట్నం–90, విజయనగరం –24, వెస్ట్‌గోదావరి–37మంది యాత్రికులను డ్రాతో నిమిత్తం లేకుండా దరఖాస్తు చేసిన వారందర్నీ ఎంపిక చేశామని తెలిపారు. ఈ యాత్రకు ఎంపికైన వారంతా ఫిబ్రవరి 5వ తేదీలోగా రూ.81వేలు చెల్లించాలని పేర్కొన్నారు. చలానా దరఖాస్తును 'ఏపీస్టేట్ హజ్ కమిటీ.కామ్' నుంచి డౌన్‌లోడ్ చేసుకుని బ్యాంక్‌లో జమ చేయాలని హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పేర్కొన్నారు.

ఐక్యతా ర్యాలీకి భారీ స్పందన

(మొదటిపేజీ తరువాయి)

ధరల పెరుగుదలను నియంత్రించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రాల హక్కు కాలరాసి వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు విపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరముందని కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్‌సిన్హా పిలుపునిచ్చారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, దేశంలో ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉందని దుయ్యబట్టారు. దేశాన్ని చిన్నాభిన్నం చేసి పాలించాలనేది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోందని యశ్వంత్ వ్యాఖ్యానించారు. కశ్మీర్‌లో అల్లర్లు, కాల్పులకు కారణమెవరని ఆయన ప్రశ్నించారు. మరో కేంద్ర మాజీ మంత్రి అరుణ్‌శౌరి మాట్లాడుతూ బీజేపీ ఒంటెద్దు పోకడలకు పెద్దనోట్ల రద్దే నిదర్శనమన్నారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను అస్థిరం చేసేందుకు కేంద్రం యత్నిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్నదే.. రేపు మధ్యప్రదేశ్‌లోనూ జరగవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విపక్షాలన్నీ ఏకమై పోరాడాల్సిన సమయమిదేనని చెప్పారు. విపక్షాలను ఏకం చేయాలన్న తృణమూల్ అధినేత్రి మమతాబెనర్జీ ప్రయత్నం శుభపరిణామమని అరుణ్‌శౌరి అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ర్యాలీకి 22 పార్టీల నుంచి నేతలు హాజరయ్యారు.

ర్యాలీ బ్రహ్మాండంగా జరిగింది : గంటా

విశాఖపట్నం : మోడీ పాలనకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మమతాబెనర్జీ చేపట్టిన ర్యాలీ బ్రహ్మాండంగా జరిగిందని మంత్రి గంటా శ్రీనివాస్‌రావు అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం కోరుకుంటున్న పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చాయని తెలిపారు. మరోసారి కేసీఆర్, జగన్, మోడీ డైరెక్షన్‌లో నడుస్తున్నారని తేటతెల్లమైందన్నారు. ఈ ముగ్గురు మోడీలు కలిసినా మళ్లీ ఏపీలో చంద్రబాబే వస్తారని మంత్రి గంటా స్పష్టం చేశారు.

ఎక్కడవేసిన గొంగళి అక్కడే

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ని ప్రణాళికలు అమలు చేసిన మార్పు కనిపిస్తున్న దాఖలాలు లేకపోవడం శోచనీయం. ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులు 2015 –16 మధ్యన 31.4 శాతం ఉంటే 2018 నాటికి కూడా అదే సంఖ్య ఉన్నట్లు తెలుస్తుంది గత ఏడాది డిసెంబర్ నాటికి కూడా 31 శాతం ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే గడిచిన కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వలన కూడా పెద్దగా మార్పు రాలేదని తెలుస్తుంది.

పౌష్టికాహార లోపంతోనే అత్యదిక మరణాలు చోటు చేసుకుంటున్నాయని 11.7 శాతం మంది చిన్నారులు ఈ సమస్యతోనే మరణిస్తున్నారని పలు రాష్ట్రాలకు ఆరోగ్య పరిస్థితులపై ఇచ్చిన నివేదికలో స్పష్టమైంది. ఇదే పోషకాహార లోపంతో చిన్నారులు వయసుకు తగినట్లు బరువు తక్కువ వుండటం, ఎత్తు లేకపోవడం వంటి సమస్యలకు కారణమ వుతుందని నివేదికలు ద్వారా బహిర్గతమవుతుంది. రాష్ట్రంలో ఈ అంశంపై నీతి ఆయోగ్ ఇచ్చిన గణాంకాలు ప్రకారం రాష్ట్రంలో బరువు తక్కువగా ఉన్న చిన్నారులు 31.9 శాతంగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలో ఎదుగుదల లోపం ఉన్నవారు 37.5 శాతం ఉంటే బరువు తక్కువగా ఉన్న చిన్నారులు ఎక్కువగా కర్నూలులో 10.3 శాతం మంది ఉన్నారని తెలుస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులు 31 శాతం ఉంటే, బరువు తక్కువ ఉన్న 6.10 శాతంగా ఉన్నట్లు వెల్లడవుతుంది. ప్రభుత్వం పోషకారం అందించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్న పౌష్టికత అందకపోవటం శోచనీయం. అంగన్‌వాడీల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న సమస్య పరిష్కారం కాకపోవటం ఆందోళన కలిగిస్తుంది. ఇటీవల ప్రభుత్వం పౌష్టికాహారం అందించే అంశంపై విస్తృత స్థాయిలో కసరత్తులు చేస్తుందని అధికారులు తెలియ చేస్తున్నారు. ముందుగా పౌష్టికాహార లోపం అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఆర్టీజీ సర్వే ద్వారా సంతృప్తి శాతం పెంచేందుకు విస్తృతంగా కృషి చేస్తుంది. ఈ క్రమంలో ఈ అంశంపై సైతం దృష్టి సారించి లోపం ఎక్కడ ఉందో గుర్తించి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

ENTRANCE EXAMS IMP DATES_2019

ENTRANCE	EXAM DATE	Last date to apply /online
BITSAT	16-05-2019 TO 26-05-2019(CBT)	05-01-2019 TO 20-03-2019
VIT	2nd or 3rd Week of April-2019	28-10-2018 TO 28-02-2019
SRM	15-04-2019 TO 25-04-2019	31-03-2019
AMRITA	22-04-2019 TO 26-04-2019(CBT) 27-04-2019(PEN &PAPER)	19-10-2018 TO 10-04-2019(CBT) 25-04-2019(PPT)
KLUEEE- 2019(KLU)	20-04-2019 (P&P) 26-04-2019 to 30-04-2019 (CBT)	05-09-2018 TO 10-04-2019
JEE MAIN(JAN)-2019	06-01-2019 TO 20-01-2019(CBT)	1/10/2018
JEE MAIN(APRIL)-2019	06-04-2019 TO 20-04-2019(CBT)	8/3/2019
IIT ADV	19-05-2019	
NEET	05.05.2019	01.11.2018 to 01.12.2018
GITAM	10-04-19 TO 22-04-19(CBT)	30-03-2019
IIST	JEE (Advanced) - 2019 marks.	05.06.2019
TS EAMCET	02-05-2019 TO 07-05-2019(CBT)	
AP- EAMCET		
K-CET		

ఓటర్ల దినోత్సవానికి గవర్నర్ రాక

రాజధాని వార్తలు, అమరావతి : ఈ నెల 25వ తేదీన విజయవాడలో నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవం రాష్ట్ర కార్యక్రమానికి గవర్నర్ ఈఎస్ఎల్ఎన్ నరసింహన్ హాజరవుతారని చీఫ్ ఎలక్షన్ అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 25న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారని చెప్పారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. గవర్నర్‌పేట ఎం.బి.భవన్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో ముస్లిం సాధికారిత రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ జస్టిస్ రంగనాథమిశ్రా కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా ముస్లిములంతా హక్కుల సాధన కోసం ఏకమవ్వాలని కోరారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సెక్యులర్, భాజనాయేతర పార్టీలు ముస్లింలకు అత్యధిక సీట్లు కేటాయించి గెలిపించే భాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ. ముస్లింల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామ

17 ఏళ్లకే క్యాట్ ర్యాంకు

సంహిత సొంతం

ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహమిచ్చే తల్లిదండ్రులు, వాతావరణం ఉండటం ఎంతో ముఖ్యం. బాలమేధావిగా గుర్తింపు పొంది చదువుల్లో రికార్డులు సృష్టించిన కాశీభట్ల సంహిత, కేవలం 17 ఏళ్ళ వయసులోనే క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) 2018లో 95.95 స్కోర్ సాధించిన దేశంలోనే అతి పిన్న వయస్కురాలు.అంతేకాదు, 16 ఏళ్ళకే ఇంజినీరింగ్ పూర్తి చేసిన మొదటి భారతీయురాలిగా కూడా గుర్తింపు సాధించింది. మూడేళ్ల వయసులోనే ప్రపంచంలోని దేశాలు, వాటి రాజధానులు, దేశాల జెండాలను గుర్తించిన బాల మేధావి ఈమె.చదువుతో పాటూ సంగీతం, చిత్రలేఖనం ఇతర రంగాలలోనూ ప్రావీణ్యం సాధించింది.



ఆమె

మూడేళ్ళ వయసులో సంహిత వాళ్ళ నాన్న తెచ్చిన పుస్తకంతో 200 దేశాల పేర్లు, వాటి రాజధానులు, దేశాల జెండాలను గుర్తుంచుకొని అడిగినప్పుడు తడబడకుండా చెప్తుండేది. అది చూసి తల్లితండ్రులు, బంధువులు ప్రోత్సహించడంతో ఎన్నో స్టేజి షోలు ఇచ్చింది. ఐదేళ్ళ వయసులో సంహిత ఓ వేదికపై ఇచ్చిన ప్రదర్శనకు ప్రశంసిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆమెకు ఓ పుస్తకం ఇచ్చారు.ఆ పుస్తకాన్ని చదివిన సంహిత.. సౌర కుటుంబం గురించి 15 పేజీల వ్యాసాన్ని రాసి అప్పటి రాష్ట్రపతి డాక్టర్. ఏపీజే అబ్దుల్ కలాంకి పంపింది.అది చూసిన కలాం తనను కలిసేందుకు సంహితకు అవకాశం ఇచ్చారు. "కలాంని కలిసినప్పుడు 'యు అర్ ఎ వెరీ గుడ్ గాళ్' అంటూ ప్రశంసించారు. అది నేను ఎప్పటికీ మర్చిపోలేను" అని గుర్తు చేసుకుంది సంహిత.

పదేళ్లకే ప్రభుత్వ అనుమతితో 10వ తరగతి చదివి 8.8 జీపీఏ పొందింది.12 ఏళ్లకే ఇంటర్మీడియేట్ ఎంపీసీలో 89 శాతం మార్కులు సంధించిన అతి పిన్న వయస్కురాలు.12వ ఏట ప్రభుత్వ అనుమతితో హైదరాబాద్‌లోని సీబీఐటీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించింది.చివరి సంవత్సరంలో బంగారు పతకం సాధించింది. 12 ఏళ్లకు రెండుజడలతో ఇంజనీరింగ్ క్లాసులకు వెళితే అన్నతో వచ్చావా..అక్కతో వచ్చావా అని అడిగేవారట..కాదు నేనుకూడా విద్యార్థినే అని చెబితే తోటి విద్యార్థులు ఆశ్చర్యపోయేవారని ఆమె చెబుతోంది.

"నేను ఇంజినీరింగ్ చదివేటప్పుడు అక్కడ ఈవెంట్స్, ప్రాజెక్ట్స్ జరిగితే టీం లీడర్‌గా ఉండేదాన్ని. దాంతో నాకు నిర్వహణ నైపుణ్యాలు వచ్చాయి. నాకున్న సాంకేతిక నైపుణ్యానికి, నిర్వహణ నైపుణ్యాలు తోడైతే నేను దేశానికి ఉపయోగపడగలను అనిపించింది. అందుకే, ఎంబీఏ చేసేందుకు క్యాట్‌ని ఎంచుకున్నాను" అని వివరించారు సంహిత."100 రోజులు క్యాట్ పరీక్షకు సిద్ధపడ్డాను. క్యాట్‌లో మూడు భాగాలుంటాయి. ఉదయం ఒక విభాగానికి, మధ్యాహ్నం మరో భాగానికి, సాయంత్రం మూడవ భాగానికి సమయం కేటాయించానని ఆమె వివరించింది. ఐఐఎంలో ఎంబీఏ ఫైనాన్స్ చేయడం తన మొదటి లక్ష్యమని, అమెరికాలోని సీఎఫ్ఏ ఇన్స్టిట్యూట్ నుంచి చార్టెడ్ ఫైనాన్సియల్ అనలిస్ట్ అవ్వడం తదుపరి లక్ష్యమని వివరించింది సంహిత. దేశ ఆర్థికాభివృద్ధికి తనవంతు కృషి చేయడం తన కల అంటోంది.సంహిత మహేష్ బాబుకు ఫ్యాన్.. ఆయన సినిమా విడుదలైన ఫస్ట్‌డే..ఫస్ట్ షో చూడాల్సిందే అంటోంది.

మా అమ్మాయి ఇంత చిన్న వయసులో ఇన్ని విజయాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మన దేశంలో క్రీడాకారులకు ఇచ్చిన ప్రాధాన్యత చదువులో నైపుణ్యాన్ని చూపే వారికి కూడా లభిస్తే ఇలాంటి సంహితలు ఎంతో మంది వస్తారు" అన్నారు సంహిత తల్లితండ్రులు ఎల్ ఎన్ కాశీభట్ల, గీత. నిజమే వారి కోరికలోనూ.. న్యాయం ఉంది.. సంహితకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహమివ్వాలని కోరుకుందాం..

వేంపల్లి షరీఫ్‌కి చాసో స్ఫూర్తి అవార్డ్ ప్రదానోత్సవం

రాజధాని వార్తలు, విజయనగరం: జిల్లా గ్రంథాలయం మొదటి అంతస్తులో చాసో సాహితీ వేదిక హాల్‌లో, చాసో 104వ జయంతి నాడు, విజయనగరంలో ఇరవై నాలుగేళ్లుగా చాసో కుమార్తె చాగంటి తులసి నిర్వహణలో చాసో స్ఫూర్తి అవార్డ్ ప్రదాన సభ జరిగింది. ప్రముఖ యువ కథకుడు, కేంద్రసాహిత్య అకాడెమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్ కి ఇరవై నాలుగో చాసో స్ఫూర్తి అవార్డ్ అందచేశారు. సభ రాష్ట్ర నాటక అకాడెమీ ఉపాధ్యక్షులు కందిమళ్ళ సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. తులసి, చాసో కథా పఠనం అనే పద్ధతిని గత సభల్లో పాటించాము అని, ఈ సారి నుంచి, కథకి ప్రత్యేకమైన ఫోకస్ ఉండాలని, కథానాటికగా ప్రదర్శన చేశాము అని చెప్పారు. లోగడ కూడా మరొక చాసో కథ కుంకుదాకు, చలం నాటికీకరణ, నిర్మాణంలో ప్రదర్శించారు. సభాధ్యక్షులు కందిమళ్ళ సాంబశివరావు తొలి పలుకుల్లో, చాసో కథల విశాల ప్రయోజనం, వాటి ప్రత్యేకమైన శైలి గురించి సాంబశివరావు వివరించారు. తులసి గారి నాటికీకరణలో ఆ కథల్లో కొన్ని ఎలా నిలదొక్కుకున్నాయో వివరించారు. చాసో కథలను ఎందుకు చదవాలి అన్న అంశం పై పాత్రికేయురాలు రెహనా మాట్లాడుతూ, కథల్లో గల విశిష్టత, భిన్న వర్గాల జీవితపు సమస్యలను చెప్పేందుకు చాసో ఎంచుకున్న తీరు వల్ల కథలు పాఠకుల చేత చదివిస్తాయని పేర్కొన్నారు. చాసో కథలు చదవడం నేటి యువతరం కథకుల బాధ్యత, అలా చేయడం వలన, జీవితంలో కథను నాటి, చెప్పే నేర్పు చాసో దగ్గర నేర్చుకోవలసిన అవసరం ఉందని చెప్తూ, ఎందుకు పారేస్తాను నాన్నా, వంటి కథను, స్త్రీ పరమైన సమస్యలను చిత్రించిన ఏలూరెళ్ళాలి , లేడీ కరుణాకరం

వంటి కథలను ఉదహరించింది. గౌరీ కృపానందన్ తమిళం లోనికి అనువాదం చేసిన చాసో కథలను, తమిళ నవలా కారులు దివాకర్ ఆవిష్కరించారు. తమిళ కథా రచయిత, జయకాంతన్ కథలు కూడా చాసో శైలి లోనే ఉంటాయని తెలిపారు. సాహిత్య అకాడెమీ, చాసో తమిళ అనువాద కథల ప్రచురణ చేయడం, దక్షిణ భారత సాహిత్య అనువాద ప్రదానం వేగవంతం కావడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. షరీఫ్ కథల పై జి.ఎస్.చలం మాట్లాడుతూ, మైనారిటీ సామాన్య జీవనాల బలమైన పరిచయం వీరి కథల ద్వారా జరిగిందని, బాల్యం ఇతివృత్తంగా, చాసో వలె, మంచి కథలు చెప్పిన పోలిక షరీఫ్ కి తగినదని చెప్తూ, కథల్లో గల భిన్నమైన సామాజిక సమస్యల పై, రాసే సాహసం తో పాటే, షరీఫ్ కి గల సామరస్య రచనా ధోరణిని కొన్ని కథలను చెప్తూ వివరించారు. ఆకు పచ్చ ముగ్గు, టోపీ జబ్బార్ వంటి కథల్లో గల ఆత్మగౌరవ ప్రతిపాదన వివరించారు. పురస్కార ప్రదానం చేసిన చాసో స్ఫూర్తి ట్రస్ట్ కి రచయిత షరీఫ్ తన స్పందనలో కృతజ్ఞతలు తెలుపుతూ ఒక సామాజిక చైతన్య సారవంత భూమికకి చాసో మారుపేరు, వారి స్ఫూర్తిలో పొందిన ఈ పురస్కారం ప్రత్యేకమైనదిగా భావిస్తాను, తన రచనల్లో వారిని ప్రేరణగా స్వీకరిస్తాను అని చెప్పారు. చీకటి దివాకర్ స్వాగతం / వందనసమర్పణతో ముగిసిన సభలో, సభా ప్రారంభంలో చాసో కథ వజ్రహస్తం, తులసి గారి ఏక పాత్రాభినయ నాటికీకరణకు, వర్ధమాన రచయిత భైరవభట్ల విజయాదిత్య, నటనా ప్రదర్శనగా అందించారు. విజయనగరం, సమీప ముఖ్య నగరాలకు చెందిన ప్రముఖ రచయితలు, కవులు, సాంస్కృతిక రంగాల కళాకారులు పెద్ద సంఖ్యలో సభలో పాల్గొన్నారు.

21న జనసేనలో చేరుతా : ఎమ్మెల్యే ఆకుల

రాజమహేంద్రవరం : విజయవాడలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈనెల 21న జనసేన పార్టీలో చేరుతున్నట్టు బిజెపికి చెందిన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ చెప్పారు. రాజమహేంద్రవరంలోని వివి ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ వ్యవస్థను పవన్‌కల్యాణ్ ప్రక్షాళన చేస్తారనే నమ్మకంతోనే బిజెపిని విడిచి జనసేనలో చేరుతున్నానన్నారు. తన భార్య లక్ష్మీ పద్మావతి ఐదేళ్ల నుంచే జనసేనలో పనిచేస్తున్నారని, ఆమె వల్లే తాను జనసేనలోకి వస్తున్నానని తెలిపారు.

శుభవార్త రూ. 153లకే 100 ఛానెల్స్

న్యూఢిల్లీ : ట్రాయ్ నూతన విధానం ద్వారా కేవలం రూ.153 కే 100 చానెల్స్ అందించాలని సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశించింది. ఇంతక ముందు ట్రాయ్ తీసుకొచ్చిన కొత్త నిబంధనతో వినియోగదారుడు నెలకి రూ.400 నుంచి రూ.500 వరకు కట్టాల్సింటుంది. తెలుగు ఛానెళ్ల ప్యాకేజీ కావాలి అంటే రూ.283 చెల్లించాలి. ఇప్పుడు ఈ నిబంధలను సడలించి కేవలం రూ.153 కే 100 ఛానెళ్లు ప్యాకేజీ తీసుకొచ్చి టీవీ ఛానల్ లకి ఉపశమనం కలిగించింది. ఫిబ్రవరి 1 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు ఛానల్స్ ప్రసారాలు నిలిపివేస్తున్నట్లు లోకల్ కేబుల్ ఆపరేటర్లు (ఎల్‌సీఓ), మల్టీపుల్ సిస్టమ్ ఆపరేటర్ల సంఘం (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ప్రకటించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా తీసుకొచ్చిన కొత్త టారిఫ్ విధానం వల్ల కేబుల్ ఆపరేటర్లతో పాటు సామాన్య ప్రజలపై పెను భారం పడుతుందని సంఘం ప్రతినిధులు తెలిపారు. ట్రాయ్ నిబంధనపై భవిష్యత్ కార్యాచరణపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. కొత్త విధానం ప్రకారం పే ఛానల్స్‌ను చూడటం తగ్గిస్తే వాళ్లే దారికొస్తారని ప్రజలకు సూచించారు. టారిఫ్ విధానంపై ప్రేక్షకులకు, ఆపరేటర్లకు అవగాహన లేదని కేంద్రం కనీసం ఆరు నెలల గడువు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1 నుంచి పే ఛానల్స్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

పవన్‌ను విమర్శించొద్దు: చంద్రబాబు ఆదేశం



రాజధాని వార్తలు- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ల రహస్య స్నేహ బంధం మరోసారి బయటపడింది. ఇటీవల తెనాలిలో నిర్వహించిన సభలో చంద్రబాబు నాయుడు గారిపై కక్ష సాధించేందుకే టీఆర్ఎస్ నాయకులు ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతిస్తున్నారంటూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించగా, తాజాగా పవన్‌ను విమర్శించవద్దంటూ చంద్రబాబు ఆదేశాలు జారీ చేయడం వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందాన్ని బహిర్గతం చేసింది. శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో భాగంగా టీడీపీ నేతలతో చంద్రబాబు మాట్లాడుతూ.. మోదీ, కేసీఆర్, వైఎస్ జగన్‌లపైనే దుష్ప్రచారం చేయాలని స్పష్టం చేశారు. కోల్‌కతాలో జరిగే ర్యాలీ గురించి టీడీపీ నేతలతో మాట్లాడే క్రమంలో మోదీ, కేసీఆర్, జగన్‌లను టార్గెట్ చేయాలని టీడీపీ నేతలకు సూచించారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ కూడా ఉన్నారుగా అని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి తెలపగా, పవన్‌ను విమర్శించవద్దని బాబు ఆదేశించారు. 'నేను చెప్పింది చేయండి' అంటూ బుచ్చయ్యచౌదరిని బాబు మందలించారు. పవన్ కల్యాణ్ మనవైపే ఉన్నారనే సంకేతాలు చంద్రబాబు ఇవ్వడం చర్చనీయాంశమైంది.

చట్టసభల్లో ముస్లింలకు 15 సీట్లు కేటాయించాలి

ముస్లిం పర్సనల్‌బోర్డు అధ్యక్షుడు అల్తాఫ్ బాబా

రాజధాని వార్తలు, ఇబ్రహీంపట్నం : చట్ట సభల్లో ముస్లింలకు 15 సీట్లు కేటాయించాలని ముస్లిం పర్సనల్ బోర్డు ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎంఏ అల్తాఫ్‌రాజ బాబా డిమాండ్ చేశారు. కొండపల్లి లోని హజరత్ షాబుకారి మహాత్మాతుల వారి మసీదులో జరిగిన ఆహ్లే సున్నతువల్ జమాత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ముస్లింలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌లు అమలు చేసే పార్టీలకే ఈ సారి ముస్లింల మద్దత్తు ఉంటుందని తెలిపారు. ముస్లీంలు సమస్యకు పరిష్కరించే విషయం గురించి త్వరలో సీఎం చంద్రబాబుని కలవాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. ముస్లీంల ఆస్తులను సంరక్షించడమేగాక విలువైన భూములను కూడా కాపాడాలని కోరారు. ముస్లీం విద్యార్థుల కోసం జ్యుడీషియల్ పవర్ మదర్ బోర్డును ఏర్పాటు చేయాలని. మసీదుల్లో మతగురువుల జీతాలను 10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో దర్గాలు, మసీదులు పడగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లీంలకు ఇందిరా ఆవాస్ యోజన ద్వారా ముస్లీంలకు 20 శాతం కేటాయించాలని కోరారు. సమావేశంలో ఆహ్లే సున్నతువల్ జమాత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగ అధ్యక్షులు, 13 జిల్లాలకు చెందిన ముస్లీం పెద్దలు, పండితులు, మత పెద్దలు హాజరైనారు.

ఎన్టీఆర్ పాత్ర చేస్తోంది రంగస్థల నటుడు: వర్మ

'కొన్ని నెలలు శిక్షణ ఇచ్చా..'

సినిమా

హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాలో ఎన్టీఆర్ లుక్‌ను విడుదల చేసి శుక్రవారం అందర్నీ సర్‌ప్రైజ్ చేశారు. అందులోని వ్యక్తి అచ్చం ఎన్టీఆర్‌లా కనిపించడమే దీనికి కారణం. అయితే ఆ నటుడు ఎవరో వర్మ చెప్పలేదు. దీంతో ఆయన ఎవరో ఊహిస్తూ వార్తలొచ్చాయి.

వాటికి ఫుల్‌స్టాప్ పెడుతూ "లక్ష్మీస్ ఎన్టీఆర్'లో ఎన్టీఆర్‌గా నటిస్తున్న వ్యక్తి పశ్చిమ గోదావరికి చెందిన రంగస్థల నటుడు. ఆయనకు నేను కొన్ని నెలలు ఎన్టీఆర్‌లా ప్రసంగించడం, హావభావాలు, వైఖరి తదితర విషయాల్లో శిక్షణ ఇచ్చా' అని వర్మ పేర్కొన్నారు. శుక్రవారం విడుదలైన ఎన్టీఆర్ ప్రత్యేక వీడియోకు యూట్యూబ్‌లో మంచి స్పందన లభించింది. ఈ వీడియోను కేవలం 12 గంటల్లో 1.1 మిలియన్ల మంది చూశారని వర్మ ఆనందం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఆశీర్వాదాలు 'లక్ష్మీస్ ఎన్టీఆర్'కు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అంతేకాదు ఇది యూట్యూబ్ ట్రెండింగ్‌లో ఐదో స్థానంలో ఉందని చెప్పారు.ఎన్టీఆర్, లక్ష్మీ పార్వతి జీవితాల ఆధారంగా ఈ సినిమాను వర్మ తెరకెక్కిస్తున్నారట. ఇందులో లక్ష్మీపార్వతిగా కన్నడ నటి యజ్ఞ శెట్టి నటిస్తున్నారు. ఇటీవల చిత్రంలో లక్ష్మీ పార్వతి, నారా చంద్రబాబు నాయుడు లుక్‌లను వర్మ విడుదల చేశారు. జనవరి 24న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు. మరోపక్క ఈ సినిమా పాటలపై వివాదం చెలరేగుతోన్న సంగతి తెలిసిందే.

– ఖాన్

21 నుండి త్యాగరాజు ఆరాధన ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

త్యాగరాజు అనంతరం తన ఆరాధ్యదైవం శ్రీరామునిపై కొన్ని వేల కీర్తనలను తెలుగులోనే రచించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత రూపకర్తలలో ప్రముఖుడైన త్యాగరాజు కీర్తనలను తెలుగు భాషలోనే తమిళనాడులో విశేష ప్రాచుర్యం పొందటం విశేషం. భారత దేశంలో దక్షిణాదిన కర్ణాటక శాస్త్రీయ సంగీతం, ఉత్తరాదిన హిందూస్థాని శాస్త్రీయ సంగీతం ప్రపంచ సంగీత రూపాలలో ప్రముఖ స్థానం పొందగలిగాయి. **తాగ్యరాజును తమిళులు స్వంతం చేసుకొగా ప్రపంచ ఖ్యాతిని పొందిన త్యాగరాజు కీర్తనలను తెలుగుభాషలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం ఇవ్వక పోవటం శోచనీయం.** తెలుగు ప్రజలు ఆత్మగౌరవ నినాదంతో పుట్టిన తెలుగు దేశం ప్రభుత్వం కూడా త్యాగరాజును పట్టించుకోలేదు. కాగా తమిళనాడు ప్రభావంతో త్యాగరాజు ఆరాధనోత్సవాలు భారత దేశంలోనూ మరికొన్ని దేశాలలోనూ ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖ వాగ్గేయకారుడైన త్యాగరాజుకు సొంతరాష్ట్రంలో సముచిత గౌరవం ఇవ్వటానికి సరైనా ప్రభుత్వం పూనుకుంటే బాగుంటుంది.

30 నుంచి అసెంబ్లీ
ఫిబ్రవరి 2న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

రాజధాని వార్తలు- అమరావతి: ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు శాసనసభ, శాసన మండలి సమావేశాలు జరగనున్నాయి. జనవరి 30న ఉదయం 9.30 గంటలకు ఉభయసభలు సమావేశమవుతాయని గవర్నర్ నరసింహన్ పేరిట నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 2న ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనుంది. అసైన్డ్ భూములు చట్ట సవరణ బిల్లుతో పాటు మరికొన్ని కీలకమైన బిల్లులను కూడా ప్రభుత్వం ఈ సమావేశాల్లో తీసుకొచ్చే అవకాశముంది. ఈ ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలు కానుండడంతో వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పలు సంక్షేమ పథకాలను ఈసమావేశాల్లో ప్రకటించే అవకాశం వుంది. ప్రతిపక్ష వైసీపీ సభ్యులు ఈసారైనా హాజరవుతారా ? లేక మళ్ళీ గైర్హాజరవుతారా ? అనే సందేహం తలెత్తుతోంది.

కాలమ్

8 గంటలే పని.. కనీస వేతనం అమలు చేయకుంటే 10 లక్షల జరిమానా..!

ఢిల్లీ : కనీస వేతనం అమలుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కొన్ని ప్రతిపాదనలు, సూచనలు చేసింది. అన్నిరంగాల్లో కనీస వేతనం అమలు చేయాలని ప్రతిపాదించింది. ప్రభుత్వ గుర్తింపుతో సంబంధం లేకుండా అన్ని రంగాల్లోనూ ఇది అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ప్రతి సంస్థ కనీస వేతన కోడ్ అమలు చేయాలని స్పష్టం చేసింది.

ఏ సంస్థ అయినా సరే, కనీస వేతన కోడ్ అమలు చేయకుంటే 10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశముంది. అలాగే ఉద్యోగులతో 8 గంటలకన్నా ఎక్కువగా పనిచేయించరాదనే నిబంధన పేర్కొంది. ఎంత ఎమర్జెన్సీ పని ఉన్నా.. 8 గంటలకు మించి పని చేయించుకోవద్దని సూచించింది.

జర్నలిస్ట్‌ల ఇళ్ల నిర్మాణం ప్రారంభించకుంటే
రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- ఏపీజేఎఫ్ నాయకుల హెచ్చరిక...
- ప్రభుత్వంహామీని నిలుపుకోవాలన్న ఎన్జీవో నేత అశోక్ బాబు

రాజధాని వార్తలు, విజయవాడ: జర్నలిస్ట్‌ల ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ (ఏపీజీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. విజయవాడ ధర్నాచౌక్ లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఏపీజీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య ప్రారంభించారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు చెవుల కృష్ణఅంజనేయులు, మారేళ్ల వంశీకృష్ణలు తో పాటు పెద్ద సంఖ్యలో పాత్రికేయులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు.ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెవుల క్ కృష్ణఅంజనేయులు మాట్లాడుతూ అర్హులైన పాత్రికేయులందరికి ఇల్లు నిర్మాణమే లక్ష్యంగా పోరాడుతున్నట్టు చెప్పారు. జర్నలిస్ట్‌ల ఇళ్ల నిర్మాణానికి వెంటనే శంకుస్థాపన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారందరికి ఇల్లు మంజూరుపత్రాలు ఇవ్వాలని, సీనియర్ పాత్రికేయులు అక్రిడేషన్ లేకపోయినా ఇల్లు కేటాయించాలని, రేషన్ కార్డు లేదనే కారణంతో దరఖాస్తులు తిరస్కరించరాదని ఆయన డిమాండ్ చేశారు. ఏపీజేఎఫ్ విజ్ఞప్తికి రాష్ట్రప్రభుత్వం మొదటి నుంచి సానుకూలంగానే స్పందించిందని ఆయన తెలిపారు. కానీ ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా దీనిని విస్తరిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఫైట్ ఫర్ హౌస్ నాయకుడు పులిగడ్డ సత్యనారాయణ, నాగేశ్వరరావు, శాఖమూరు శ్రీనివాస ప్రసాద్, చెవుల రంగారావు, వి శ్రీనివాసరావు, వీర్ల శ్రీరామ్ యాదవ్, యేమినేని వెంకటరమణ, సత్యనారాయణ, కూర్మ ప్రసాద బాబు, కోటేశ్వర రావు, హలీం, సాయికుమార్, గణపతి తదితరులు ప్రసంగించారు. గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు గుంటూరు, విజయవాడ నగరానికి చెందిన పాత్రికేయులు ఈ రిలే నిరాహార దీక్షలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ పరిమితి రూ.5 లక్షలకు పెంపు

ఏప్రిల్ నుంచి అమలు

రాజధాని వార్తలు-గుంటూరు : ఎన్టీఆర్ వైద్యసేవ కింద ప్రస్తుతమున్న పరిమితిని రూ.2.50 లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ నిర్ణయం ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 36 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని, వావిలాల ఘాట్‌ను ఆవిష్కరణలో ఆయన ఈ విషయం వెల్లడించారు.రూ. 12 కోట్లు ఖర్చు పెట్టి ఎన్టీఆర్ విగ్రహాన్ని, రెండు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు.

పెట్రోలు రేట్లు పైపైకి..

ముంబై : కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టినట్టు కనిపించిన పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 17 పైసలు, డీజిల్ పై 19 పైసలు పెరిగింది. వర్తక వాణిజ్యాలకు కేరాఫ్ అడ్రస్ అయిన ముంబయిలో పెట్రోల్ 17 పై డీజిల్ పై 20 పై పెరిగింది. ఇక తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్ లో పెట్రోల్ ధర 19 పై.లు (రూ.75.01) డీజిల్ ధర 22 పై.లు (రూ.74.90) గా ఉంది. విజయవాడలో పెట్రోల్ ధర 16 పై.లు (74.90), డీజిల్ ధర 26 పై.లు (70.34)లకు పెరిగింది.

పొగమంచుతో విమానాల రాకపోకల్లో జాప్యం

న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దట్టమైన పొగమంచు కప్పేయడంతో విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మంచు వల్ల పలు 200 విమానాల రాకపోకల్లో జాప్యంతోపాటు కొన్ని విమాన సర్వీసులు రద్దు చేశామని విమానాశ్రయ అధికారులు చెప్పారు. కొన్ని విమాన సర్వీసులను ఆలస్యంగా నడపడంతో పాటు కొన్నింటిని దారి మళ్లించామని అధికారులు పేర్కొన్నారు. విమానాల రాకపోకల్లో 9 గంటల జాప్యం వల్ల విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఐదు దేశీయ విమాన సర్వీసులను దారి మళ్లించారు. సింగపూర్ నుంచి ఢిల్లీకి రావాల్సిన విమానాన్ని కోల్‌కతాకు మళ్లించారు. రిపబ్లిక్ డే రిహార్సల్స్ వల్ల ఈ నెల 18,20,24,26 తేదీల్లో విమానాల రాకపోకల్లో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని విమానాశ్రయ అధికారులు చెప్పారు.

సైనిక వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్

మొదటి సైనికాధికారి కరియప్ప, జవహర్‌లాల్ నెహ్రూ

కన్నాట్ ప్లేస్‌లో వేడుకలను తిలకించేందుకు వచ్చిన జన సందోహం

ప్రప్రథమ రిపబ్లిక్ వేడుకలు

సీనియర్ వ్యాసకర్త ఆర్.వి.స్మిత్‌తో ఆనాటి జ్ఞాపకాలు

1950 జనవరి 26న విదేశీ పాలన పూర్తిగా అంతరించిపోయి భారత్ గణతంత్ర దేశంగా రూపొందింది. పురానా ఖిల్లా ఎదుట ఉన్న బ్రిటిష్ స్టేడియంలో ప్రప్రథమ రిపబ్లిక్ డే పెరేడ్ జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ, సి.రాజగోపాలాచారి సమక్షంలో డా. రాజేంద్ర ప్రసాద్ మొదటి రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉదయం ఆ స్టేడియంలో ముప్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. ఆ తర్వాత పెరేడ్ ప్రారంభమయ్యింది. గాల్లోకి పేల్చిన తుపాకీ చప్పుళ్లు ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించాయి. చివరి బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ లూయిస్ మౌంట్‌బాటన్ నుంచి గవర్నర్ జనరల్ బాధ్యతలను సి.రాజగోపాలాచారి అప్పటికే స్వీకరించారు. స్వతంత్ర దేశంగా పురుడుపోసుకుని ప్రపంచ దేశాల కూటమిలో సంపూర్ణ స్వతంత్ర దేశంగా భారత్ చేరింది. అప్పటి బ్రిటన్ రాజు కింగ్ జార్జ్-6 భారత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఇండియాకు కామన్‌వెల్త్ దేశాల సభ్యత్వం కొనసాగడంపై హర్షం వ్యక్తం చేశారు.అప్పటికే అంతర్జాతీయమైన నేతాజీ సుభాస్ చంద్రబోస్ 'ఢిల్లీ చలో' పిలుపునిస్తూ రిపబ్లిక్ డే వేడుకల్లో తిరిగి ప్రత్యక్షమవుతారన్న వార్తలు దావానంలా వ్యాపించాయి.అప్పటికి రెండేళ్ల ముందే మహాత్మ గాంధీ మరణించారు. రిపబ్లిక్ వేడుకల్లో ఆయన లేకపోవడం లోటుగా కనిపించింది.ఇప్పుడు జరుపుతున్నంత ఆర్భాటంగా ఆనాటి రిపబ్లిక్ డే వేడుకలు జరగలేదు...కానీ అప్పటికి ఆ వేడుకలు కూడా బ్రహ్మాండంగానే జరిగాయని చెప్పుకోవాలి. రిపబ్లిక్ వేడుకల్లో నేవీ, ఎయిర్ ఫోర్స్, సైనిక దళాలు పాల్గొన్నాయి.. అయితే రాష్ట్ర ప్రభుత్వాల శకటాలు లేవు. ఇప్పటిలా న్యూఢిల్లీ, ఎర్రకోటల మీదుగా పెరేడ్ సాగలేదు. ఆనాటి పెరేడ్ మొత్తం బ్రిటీషు స్టేడియానికే పరిమితమైంది. వేడుకల్లో భాగంగా యుద్ధ

మొదటి రిపబ్లిక్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఇండోనేషియా అధ్యక్షుడు, పక్కన జవహర్‌లాల్ నెహ్రూ

విమానాల విన్యాసాలు జరిగాయి. కానీ ఆ విన్యాసాల్లో జెట్ విమానాలు, థండర్‌బోల్ట్ విమానాలు లేవు. అప్పటికి వినియోగంలో ఉన్న డకోటా, స్పిట్ ఫైర్స్ మాత్రమే విన్యాసాల్లో పాల్గొన్నాయి.1951 నుంచి పెరేడ్ ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు.మొట్టమొదటి భారత సైన్యాధిపతి కరియప్ప. ఈయన బ్రిటిష్ ప్రభుత్వంలో కూడా ఎంతో గౌరవం, కీర్తి సంపాదించిన వ్యక్తి.

"ఈరోజు నాకు, మీకు, మనతో పాటు మన కుక్కలకు కూడా స్వాతంత్ర్యం వచ్చింది" అంటూ సైనికాధిపతి కరియప్ప బారత సైన్యాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన వ్యాఖ్యలు అక్కడివారిలో ఆనందం, ఉత్సాహాన్ని నింపాయి.ఇప్పటికీ నాకు గుర్తే. **రిపబ్లిక్ డే సందర్భంగా జామా మసీద్ సమీపంలోని ఓ హోటల్ యజమాని అందరికీ స్వీట్లు పంచాడు. ఆ స్వీట్ల రుచి నాకింకా గుర్తుంది. అవి మహాద్భుతంగా ఉన్నాయి. చాందినీ చౌక్‌ను అందంగా ముస్తాబు చేశారు. వీధుల నిండా ప్రజలు. వారి చేతుల్లో చిన్నచిన్న జాతీయ జెండాలు. వారంతా చాలా ఉత్సాహంగా కనిపించారు. ఎక్కడ చూసినా బంతిపూల హారాలే..పూల వ్యాపారులు ఆ ప్రాంతమంతా రోజా పూలను చల్లారు. ఒకరికొకరు పువ్వులు ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.** 1947ఆగస్ట్ 15న పురుడుపోసుకున్న స్వతంత్ర భారతం.. 1950, జనవరి 26కు ఒక రూపం తీసుకుందన్న భావన వారిలో స్పష్టంగా కనిపించింది. ఢిల్లీలో ప్రధాన కూడలి 'కన్నాట్ ప్లేస్'ను చాలా అందంగా ముస్తాబు చేశారు. నగరంలోని కొన్ని హోటళ్లు, ప్రధాన దుకాణాలు తమ అమ్మకాలపై డిస్కౌంట్లు కూడా ప్రకటించాయి. ఆ రోజు రాత్రి ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలన్నీ దీప కాంతులతో వెలిగిపోయాయి. రాష్ట్రపతి భవన్‌ను కొత్త పెళ్లికూతురిలా ముస్తాబు చేశారు.ఎర్రకోట, పార్లమెంట్ భవనం, ఆల్ ఇండియా రేడియో కార్యాలయం, ఇండియా గేట్, అన్నిటి వైభవాన్ని ఆరోజు చూడాలి. ఆ అందమే వేరు! మరోవైపు, క్లబ్బులు, రెస్టారెంట్లలో పాటలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ.. ఒకటే కోలాహలం, సంబరం.. ఎక్కడ చూసినా పండగ వాతావరణమే!ఆ కాలంలో జీన్స్ ప్యాంట్లు లేవు. కానీ, పాశ్చాత్య దుస్తుల్లో కనిపించే అందమైన యువతులు క్లబ్బులు, రెస్టారెంట్లలో తళుక్కుమన్నారు. అమ్మాయిల విషయంలో యువకుల మధ్య ఒకట్రెండు చిన్నచిన్న గొడవలూ జరిగాయి. ఎక్కడచూసినా రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన విందు గురించే చర్చలు నడిచాయి.జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కూతురు ఇందిరాగాంధీ, రాజేంద్ర ప్రసాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానా ఆజాద్ మరెందరో ఆ విందులో పాల్గొన్నారు.చివరగా ఆ రాత్రి జరిగిన ముషాయిరాలు, కవిసమ్మేళనాలతో తొలి రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా ముగిశాయి..

– బీబీసీ సౌజన్యంతో..

హుబ్లీ నుంచి ఎర్రకోట వరకు

కర్నాటకలోని హుబ్లీలో ఖాదీ గ్రామోద్యోగ సంయుక్త సంఘ్(కేకేజీఎస్ఎస్) నుంచి ఎర్రకోటపై ఎగురవేసే త్రివర్ణపతాకం నుంచి అన్నిచోట్లకు సరఫరా అయ్యే జెండా రూపొందుతుందని మీకు తెలుసా ? దేశంలో అధికారిక జెండా తయారీ కేంద్రం అదొక్కటే. 1957లో 17 ఎకరాల స్థలంలో నెలకొల్పిన కేకేజీఎస్ఎస్ ప్రజలకు దేశభక్తిని పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తోంది. ఆ ఆవరణలో మొదట రెడీమేడ్ వస్త్రాలు, అల్యూమినియం పాత్రలు, కార్పెంటరీ, ఇనుప పనిముట్లు, వస్త్ర రంగులు తయారయ్యేవి. ప్రకృతి సాధనాలయ,ఆల్ ఇండియా ఖాదీ గ్రామోద్యోగ విద్యాలయ (టెక్స్‌టైల్ కెమిస్ట్రీ) కూడా ఉండేవి. 2002 నుంచి కేకేజీఎస్ఎస్ జెండాలు రూపొందిస్తోంది. దీనికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిస్) నుంచి ఇందుకు సంబంధించిన సర్టిఫికేట్ 2006లో వచ్చింది. బిస్ ఆదేశాల మేరకు జెండా తయారీ చేపట్టాల్సి వస్తుంది. దానిలో తేడాలుంటే జైలుకెళ్లాల్సిం వస్తుందనడంలో సందేహం లేదు. చరఖాపై వడికిన నూలు నుంచి జెండాలు

రూపొందుతాయి. వడికిన నూలును హుబ్లీకి పంపుతారు. వడికిన నూలు నుంచి నేసిన బట్టను బెంగేరీలో బ్లీచ్ చేసి, మూడు రంగులను అద్ది, కొలతల ప్రకారం ముక్కలు చేసి కుడతారు.ఇక్కడి నుంచే ఇతర దేశాలకు, వేర్వేరు ప్రాంతాలకు రవాణా అవుతాయి. ఇందులో 250 మంది పనిచేస్తున్నారు. తులసీనగర్, జలిహల్,హుబ్లీల్లో నూలు తయారు అవుతుంది. జెండా ఎగురవేశేవారు తప్పనిసరిగా బిస్ ఆదేశాలను పాటించాల్సి ఉంది. పాలిస్టర్, ప్లాస్టిక్ జెండాలను ఎటువంటి పరిస్థితుల్లోనూ ఎగురవేయరాదు. బిస్ గుర్తింపు పొందిన జెండాలు మాత్రమే ఉపయోగించాలి. ప్రసుతం పిల్లలు ఉపయోగించే జెండాల తయారీని చేపట్టనున్నారు. రంగు,సైజు,నాణ్యత తయారీలో ఏమాత్రం లోటుపాట్లు ఉన్నా భారత ప్రభుత్వతం తీవ్ర నేరంగా పరిగణిస్తుంది.

ఈ కేంద్ర ప్రారంభించినప్పుడు కేవలం 5 మగ్గాలు 30 మంది ఉద్యోగుల మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం వాటి సంఖ్య 55కు ఉద్యోగుల సంఖ్య 250కు పెరిగాయి. నూలు వడికే చరఖాల సంఖ్య కూడా పెరిగింది. 2005-06ల్లో బిస్ రూపొందించిన తొమ్మిది రకాల కొలతల్లో 10,314 జెండాలు మాత్రమే అమ్మగలిగారు. 2013-14ల్లో స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డేలకు ప్రతి గ్రామపంచాయతీల్లో తప్పనిసరిగా జెండా వందనం జరిగాలని ప్రభుత్వం ఆదేశించడంతో వీటి అమ్మకాలు పెరిగాయి.

మేము తయారు చేసిన జెండాలకు ప్రధాని,రాష్ట్రపతి కూడా సెల్యూట్ చేయడం మాకెంతో ఆనందాన్ని కలిగిస్తుందని ఉద్యోగులు చెబుతున్నారు.

– ఖాన్

ఘనంగా ప్రవాసాంధ్ర పరిరక్షక ప్రోత్సాహక ఉత్సవాలు

రాజధాని వార్తలు, అమరావతి : ప్రవాసాంధ్ర పరిరక్షక ప్రోత్సాహక ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మన జాతి పిత మహాత్మా గాంధీ భారత దేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా ప్రతి ఏడాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధ్వర్యంలో జరుగుతున్నాయి. అంతేకాకుండా భారత దేశ అభివృద్ధికి విదేశీ భారతీయుల సంఘం సహకారానికి గుర్తుగా కూడా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రవాసాంధ్ర దివస్ సందర్భంగా ఏపిఎన్ఆర్‌టి ఆఫీస్ లో ప్రవాసాంధ్ర పరిరక్షక ప్రోత్సాహక ఉత్సవాలు జరిగాయి. విదేశాల్లో అనుకోని పరిస్థితుల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపిఎన్ఆర్‌టి 50,000/- రూపాయలను ఆర్థిక సాయంగా అందచేసింది. మొత్తం చనిపోయిన వారి సంఖ్య 94 కాగా వారిలో 20 మంది భాధితులకు చెక్కులు అందించారు. మిగతావారికి కూడా వారి కుటుంబసభ్యులు ధృవీకరణ పత్రాలు ఏపిఎన్ఆర్‌టికి అందచేసిన వెంటనే అందిస్తారు. ఏపిఎన్ఆర్‌టి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.భవానీశంకర్ చెక్కులు అందచేశారు. ఏపిఎన్ఆర్‌టి సొసైటి అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ వేమూరి, డైరెక్టర్ ఆపరేషన్స్ చప్పిడి రాజశేఖర్ పాల్గొన్నారు.

'కెరీర్ ఎక్స్‌పో' మెగా జాబ్ మేళా

రాజధాని వార్తలు, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఈనెల 23, 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రెండు రోజులపాటు కెరీర్ ఎక్స్‌పో పేరుతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఒక్కో జిల్లాలో రెండు చోట్ల నిర్వహించే కెరీర్ ఎక్స్‌పోలో 50 నుంచి 60 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరు అవుతారు. యువనేస్తం లబ్దిదారులతోపాటు డిప్లొమా, ఐటిఐ, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన 20 నుంచి 35ఏళ్లలోపు వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. నిరుద్యోగ యువత ఈనెల 21వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఎపిఎస్ఎస్‌డిసి వెబ్ సైట్ లో పేర్లను నమోదు చేసుకున్నవారు పోర్టల్లోని 'అప్ కమింగ్ ఈవెంట్స్' విభాగంలో ఆయా జిల్లాల జాబ్ మేళాపై క్లిక్ చేసి లాగిన్ అయి అప్లై చేసుకోవాలి. ఇక జాబ్ మేళాకి మొదటిసారి హాజరవుతున్న అభ్యర్థులు తమ పేర్లను https://www.apssdc.in/home/candidateregistration లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

బెంగళూరు సెంట్రల్ నుంచి ప్రకాశ్‌రాజ్

శివాజీనగర(కర్ణాటక): లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్నట్లు ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రకటించారు. ప్రస్తుతమున్న ఏ పార్టీలోనూ నిజాయితీ లేదని, అందువల్ల ఏ పార్టీలోనూ చేరబోనన్నారు. బెంగళూరులోని మార్థాస్ ఆస్పత్రిలో జన్మించానని, చామరాజపేట, శాంతినగరలలో కొన్నాళ్లు నివాసం ఉన్నానని చెప్పారు. 'జస్ట్ ఆస్కింగ్' ద్వారా తాను అడిగిన ఏ ప్రశ్నకూ ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదన్నారు. పార్లమెంట్‌లోకి అడుగు పెట్టిన నేతలు.. ప్రజా సమస్యలపై గళం విప్పకుండా ఎవరో ఒకరి చెప్పుచేతల్లో ఉండిపోతున్నారని విమర్శించారు. త్వరలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తానన్నారు.

పాదయాత్రలు-ప్రయోజనాలు

దేశంలో మొట్టమొదటి పాదయాత్ర చేపట్టింది మహాత్మాగాంధీ. 1930లో 'దండి సత్యాగ్రహం' పేరుతో ఉప్పుకోసం గుజరాత్‌లో పాదయాత్ర ప్రారంభించారు. ఆపై అస్పృశ్యతా నివారణకోసం 1933 నుంచి 34 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించారు. ఆయన మార్గాన్ని అనుసరించిన వినోభాభావే 1951లో పేదలకు భూమిని పంచాలని తెలంగాణ నుంచి 'భూదాన' పాదయాత్ర చేపట్టి బోధ్‌గయలో విరమించారు. ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్న మహత్తర ఆశయంతో మాజీ ప్రధాని చంద్రశేఖర్ 1983 జనవరి 6న కన్యాకుమారి నుంచి పాదయాత్ర చేపట్టి 4,260 కిమీ ప్రయాణించి 1983 జూన్ 25న ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ముగించారు. రాజ్‌గోపాల్ , పీవీ ఆధ్వర్యంలో 2007లో 25 వేల మంది భూమిలేని రైతుల కోసం 28 రోజుల పాటు గ్వాలియర్ నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర చేపట్టారు. రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత రాజేంద్ర సింగ్ రాజస్థాన్ గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి చెక్ డ్యాంలు, జోహడ్స్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

ఆంధ్రప్రదేవ్ విషయానికి వస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మూడు నెలలపాటు 'ప్రజాప్రస్థానం' పేరుతో 1,475 కిమీ పాదయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి

వైఎస్ కంటే ముందు వెండితెర రాముడు ఎన్టీరామారావు 1982లో తెలుగుదేశం పార్టీని ప్రారంభించి ప్రపంచస్థాయి సాంకేతికతను ప్రదర్శించారు. 'చైతన్య రథయాత్ర' పేరుతో రోడ్ షో నిర్వహించి కేవలం 9 నెలల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. ప్రస్తుతం ప్రతి చోటా రాజకీయనాయకులు రోడ్‌షోలు నిర్వహించడం పరిపాటిగా మారింది. వింటేజ్ చెవర్లెంట్ కారుకు లౌడ్‌స్పీకర్లు, ఫ్లడ్ లైట్లు అమర్చి ప్రజల రామారావు ప్రజల మధ్య కెళ్లారు. అందులోనే ఆయన సేదతీరడానికి అన్ని ఏర్పాట్లు ఉండేవి. కారు పైభాగానికి ఎక్కి ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించేవారు. ఇది పాదయాత్ర కాదు..

ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల నుంచి ఆయన నడిచారు. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల నుంచి మొదలైన ఆయన పాదయాత్ర మెదక్, నిజామాబాద్, కరీంనగర్,వరంగల్, ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ,విజయనగరం నుంచి సాగి, శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురంలో ఆయన పాదయాత్ర ముగిసింది. అప్పటి తెలుగుదేశ ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎండగడుతూ, రైతులకు భరోసా ఇవ్వడంతో ప్రజానుగ్రహం పొంది 2004లో ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు జగన్ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లగా, ఆయన స్థానంలో జగన్ సోదరి వైఎస్ షర్మిల పాదయాత్ర చేపట్టారు. 2012 జూన్‌లో సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌లో ఆమె పాదయాత్ర ప్రారంభించి ఉప ఎన్నికలు జరిగిన 18 అసెంబ్లీ స్థానాల్లో 16 సీట్లు, ఒక ఎంపీ సీటును స్వతం చేసుకున్నారు. 'మరో ప్రజాప్రస్థానం' పేరుతో ఆమె నిర్వహించిన పాదయాత్రలో 2012 అక్టోబర్ 18 నాటికి 3000 కిలోమీటర్ల పాదయాత్ర ముగించి చరిత్ర సృష్టించారు. 230 రోజుల్లో 3112 కిమీ నడిచారు.

2014లో చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండి అధికారం కోసం 'వస్తున్నా మీకోసం' పేరుతో సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ బలహీనపడిన ప్రాంతాల్లో ఆయన దృష్టిని నిలిపి తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రల్లో పాదయాత్ర జరిపారు.రోజుకు 8 కిమీ చొప్పున 117 రోజుల్లో 13 జిల్లాల్లో పర్యటించి 2,340 కిమీ నడిచారు. కాంగ్రెస్ నుంచి అధికారం జేజిక్కించుకోవడానికి ఆయన మళ్లీ వైఎస్సార్ పథకాన్నే ఎంచుకున్నారు.

జగన్ సుదీర్ఘ పాదయాత్ర

ఈరోజు ఎంతమంది యువనాయకులు పాదయాత్ర జరపడానికి ముందుకొస్తున్నారో తెలియదుకాని, వైఎస్ జగన్ మాత్రం ఓర్పు , సహనంతో సుదీర్ఘకాలం 'ప్రజాసంకల్ప' పాదయాత్ర నిర్వహించారు. దీనిఫలితం మరో మూడు నెలల్లో తెలియనుంది.

2017 నవంబరు 6న యాత్ర ప్రారంభించిన జగన్ 2019 జనవరి 9న ముగించే సరికి 3,648 కిమీ నడిచారు. సీబీఐ కోర్టులో హాజరవడానికి ప్రతి గురువారం మధ్యాహ్నం యాత్ర నిలిపివేసి మళ్లీ ప్రారంభించడం అరుదైన పరిస్థితి. ఈ 341 రోజుల్లో జగన్ 175 నియోజక వర్గాలలోనూ 130 సందర్శించారు. 124 బహిరంగ సభలు, 55 బృంద సమావేశాలు జరిపారు. ప్రజలలో ఇంత విస్త్రృతంగా పర్యటించడం అనుకూలాంశమే. వైసీపీ ఎమ్మెల్యేలు 23 మంది, ఎంపీలు ఎమ్మెల్సీలు డీడీపీలోకి ఫిరాయించడంతో కలిగిన నష్టాన్ని భర్తీ చేసుకుని పార్టీని సంఘటితపర్చుకోవడం పాదయాత్ర ఉద్దేశాల్లో ఒకటి. అందుకే లెక్కలేనని పార్టీ భేటీలు జరిగాయి. కొందరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను మార్చడం, దీంతో కొందరు పార్టీమారడం కూడా జరిగింది. శాసన సభలో ప్రభుత్వాన్ని నిలదీయకుండా పాదయాత్రలు చేస్తే ప్రయోజనమేమిటనన్నది జగన్ ఎదుర్కొన్న ప్రధాన విమర్శ. సభలో వున్నా మాకు అవకాశం ఇచ్చి వినడం లేదు గనక అంతకంటే బయిటే బాగా వినిపించామని పాదయాత్ర ముగింపు ఇంటర్వ్యూలో జగన్ సమర్థించుకున్నారు. మొత్తం 13 జిల్లాల మీదుగా ఇచ్ఛాపురం వరకు ప్రజాసంకల్ప యాత్ర సాగింది. పట్టుదల, విలువలు, విశ్వసనీయత, భరోసా వారసత్వంగా పుణికిపుచ్చుకున్న వైఎస్ జగన్ వజ్ర సంకల్పానికి శ్రీకాకుళం సాక్షిభూతంగా నిలిచింది.

విసుగూ, విరామం లేకుండా పార్టీ ప్రముఖులను, ప్రజా ప్రతినిధులను, వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన బాధ్యులను, కార్యకర్తలను చిరునవ్వుతో ముచ్చటిస్తూనే ముందుకు సాగారు. నడిచింది తానే అయినా నడిపించింది మీరేనని ఆయన ప్రజలకు చెప్పిన ఆయన తీరు అందర్నీ ఆకట్టుకుంది.

హైదరాబాద్ నుంచి దుబాయ్ 3 వేల కిలోమీటర్లు కాగ, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కూడా (3,648కిమీ) అంతే దూరం జగన్ రాష్ట్రంలో తిరిగారన్నమాట. దీంతో సుదీర్ఘంగా ప్రజలతో మమేకమయ్యే సమయం చిక్కింది. దీన్ని ఆయన తనకనువుగా మార్చుకున్నారు. అధికారపక్ష అలసత్వాన్ని ప్రజల ముందుకు తీసుకు వెళ్లారు. రాష్ట్రం అప్పుల పాలైందని,చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేనాటికి రూ.87,612 కోట్లుగా ఉన్న రైతుల అప్పులు ఇవాళ తడిసిమోపెడై, వడ్డీల మీద వడ్డీలు పడి అక్షరాలా రూ.1,30,000 కోట్లకు ఎగబాకిందన్నారు. 23 మంది ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్లుగా కొనేశారు. ఒక్కొక్కరికి రూ.20 కోట్లు, రూ.30 కోట్లు ఇచ్చారని విమర్శిస్తూ, అందులో కొందరిని మంత్రులను చేశారని ప్రజాస్వామ్య ఖూనీని ఆయన ప్రజల ముందుకు తీసుకు వెళ్లారు. నవరత్నాలతో అందరికీ అనువైన పాలన సాగిస్తానని చెప్పిన ఆయన రాష్ట్రాన్ని 25 జిల్లాలుగా చేసి సుపరిపాలన అందిస్తానన్నారు.గ్రామ సెక్రటేరియెట్లు తీసుకొచ్చి, స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని, పెట్టుబడి తగ్గించి రైతులకు ఆదాయం పెంచుతామని జగన్ వెల్లడించారు. రైతుల తరపున ప్రభుత్వమే బీమా సొమ్ము (ప్రీమియం) కడుతుందని, ప్రస్తుత ప్రభుత్వం మూసివేసిన సహకార డెయిరీలను ప్రోత్సహిస్తామని, 4 వేల కోట్లతో ప్రకృతి వైపరిత్యాల ఫండ్ ఏర్పాటు చేయడమే కాకుండా, ప్రతి రైతుకు రూ.12, 500 అందించి రైతుకు రెట్టింపు ఆదాయం వనకూర్చుతామని వైసీపీ రూపొందించిన నవరత్నాలను ప్రజలకు వివరించారు. ఆయన మాటలు ప్రజలు ఎంతవరకు విశ్వసించారో చూడాలంటే ఎన్నికలు ముగియాల్సిందే.

– బోస్



మూకుమ్మడి దాడి

జగన్ మొదటి నుంచి మూకుమ్మడి దాడిని ఎదుర్కొంటున్నారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ప్రతిపక్షం నుంచి 23 ఎమ్మెల్యేలను కొని వారిలో నలుగురికి మంత్రిపదవులు ఇచ్చి అధికార పక్షం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినా వామపక్షాలతో సహా ఎవరూ దాన్ని సీరియస్‌గా తీసుకోకుండా, అసెంబ్లీకి వెళ్లకుండా పాదయాత్రలేమిటని ప్రశ్నించాయి... ఏది ఏమైనా తెలంగాణాలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఎమ్మెల్యేల కొనుగోళ్లు టీడీపీ పతాక స్థాయికి తీసుకు వెళ్లింది. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుకాగ, ప్రజాస్వామ్యవాదులకు, ప్రజలకు వేధనాభరిత అంశం.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com